# నా మొదటి క్రాఫ్

స్కూలుఫైనలు పాసైన వాడికీ కానివాడికీ భేదం వుంటుందంటారా, వుండదంటారా ? బ్రాహ్మడికీ పంచముడికీ వున్నంత భేద ముండకపోవచ్చును గాని, అసలు వుండదంటారా లేదా ? కలెక్టరు దగ్గరికి గుమాస్తాపని యివ్వమని వ్రాసుకొని, స్కూలుఫైనలు, కానివాడూ వెళ్ళాడు; నేనూ వెళ్ళాననుకోండి. వాణ్ణి చూడగానే 'పాసైనావా' అని అడుగుతాడు. కాని వాడేమీ మాట్లాడకముందే కనిపెడతాడు దొర, వాడి గ్రహచారం. కనిపెట్టడంతోనే గజ్జికుక్కను తరిమినట్లు తరుముతారు బయటికి. అంతేనా? నన్నో ! నన్ను చూడగానే నా సర్టిఫికెట్టు పుస్తకంపైన వేసిన అట్టకాయితం విప్పకముందే కుర్చీ చూపించి తన కొడుకు నాదరించినట్లు ఆదరిస్తాడు. అంతేగదా ! ఈ కాస్త సంగతీ మా నాన్నకి తెలీదు. తెలియజేస్తే తెలుసుకోడు. నేను పాసుకాకముందు, సరే, విస్తట్లో రెట్టవేసిన కోడిని చూసినట్లు చూసేవాడు నన్ను. నేనేమన్నాను ? న్యాయమేనని వూరుకున్నాను. కాని పాసయిం తరవాతకూడా అంత లఘుదృష్టినే ప్రసరిస్తాడు. నామీద. అదేమిటి చెప్పండి ! మళ్ళీ తాను నాలుగుసార్లు లోవర్ సెకండరీపైన దండెత్తె, ఓడి, గాయాలై విసికెత్తి, తిట్టుకుని, పరిగెత్తి కోమటి వీరయ్య దగ్గర గుమాస్తాగా శరణు చొచ్చాడు. జోసెఫ్ నన్ను కంగ్రాచులేట్ చేస్తోవుండగా, నేను చదవకుండానే, రాయకుండానే అద్భుతంగా, నా అదృష్ట రేఖవల్ల యెట్లా పాసైనానో వర్ణిస్తూవుండగా మానాన్న వొచ్చి "ఏమిరా వెధవా ! పాటిమీదికి పెరుక్కు పోలే దింకా! కంచంముందు కూచుని దాచిపెట్టినట్లు 'పెరుగు' అని అరు చెపుతా" నన్నాడు. నేను స్కూలు-ఫై-న-ల్ పాసైన వుదయం.

అసలు మా యిద్దరికీ ఆ వుదయం పోట్లాటలెందుకు పడ్డదంటే, నా మొక్కు విషయమై. నేను పరీక్ష పాసైతే మా వూరి ఆంజనేయస్వామికి నా జుట్టు యిస్తానని దృఢంగా మొక్కుకున్నాను. వొంటినిండా బొచ్చున్న ఆ స్వామికి నా జుట్టుతో ఏమిపని అనుకొన్నాను గాని, ఆలోచించగా ఆ తిరపతి వెంకటేశ్వరస్వామికి అన్ని జుట్లమీద ప్రేమ ఉండగా లేనిది, ఆ స్వామి ప్రియభక్తుడు, యీకోతి స్వామికి మాత్రం నావొక్క జుట్టుమీదైనా యిష్టముండ కూడదా అని సమాధానం తోచింది. ఒకసారి యీమయింది ! సీతాపతి భార్య తిరపతిలో జుట్టు మరిచిపోయియిస్తే, వెధవుముండల పెళ్ళిళ్ళ ట్రావిలింగ్ ఏజెంటు మావూరు వొచ్చి, ఆమెను వితంతువనుకొని రాజమండ్రి యెత్తుకుపోయినాడు. మొగుడు వెళ్ళి మొత్తుకుంటే, ఆ జుట్టు త్వరగాపెంచి, అతనికే ఆమెనే విధవావివాహం చేసి, అది రెండువందలా ఆరో వివాహమని పేపర్లలో వైభవంగా వేయించి, పంపారు.

పోనీ ఆ వెంకటేశ్వరసామికి, చిన్నపిల్లల మొదటి చిన్న వెండ్రుకలమీదో, చక్కని నల్లని పొడుగాటి కుంతలాలమీదో కన్నుపడ్డదంటే అర్థముంది. కాని యేదేముడికీ అర్పణము కాకండానే మెడమీద గొరిగినట్టున్న తూముతలలు, ఈగకాలు జారిపోయి బోల్తాపడే అద్దం

బట్టతలలూ, యింక వితంతు తలలనించి భేదం చూపడంకోసమే నాలుగుపీచుల్ని ముడేసి పెట్టే దరిద్రతలలూ - యివన్నీ గొరిగించుకొని, జబ్బులు నయంచేస్తాడే, పరీక్షలు పాసుచేస్తాడే ఆయనకేంలాభం? గుప్పెడు జుట్టురానీ లాభంమాట అట్లావుంచి, అదేం 'టేస్టు!'

నా ఫౌన్టెన్ పెన్నుండగా, నా బొమ్మల ఆల్బముండగా, శివాయితో రెండుగంటలు జాంబవంతసంగ్రామంచేసి నేను గెలుచుకున్న విరిగిన చాకువుండగా, నా జుట్టుమాత్రం యేం మహాగొప్పఅని, దీన్ని మొక్కుకున్నానంటే. దీని కో కథ వుంది. గడచిన ఐదు ఏళ్ళ నించీ పూజనీయులైన మా నాన్నగారికీ, నాకూ నాజుట్టుకి వుండవలసిన కొలతనుగురించి ఘోరసంగ్రామం జరుగుతూవుంది. పదహారంగుళాలు పొడుగున గుర్రానికిలాగు వెనక వేళ్లాడుతో కనపడితేగాని, మా పుణ్యవంశపు పునాది రుషులకీ, పితృదేవతలకీ చాలాకోపం వొచ్చి, బతికున్న మా ముసలి అత్తకీ, నాకూ, మా నాన్నకీ, కచేరీ బేరీదొరకీ అద్భుతమైన కీడు కలగజేస్తారని మా నాయన అభిప్రాయం. పాతికంగుళం మొదలు రెండంగుళాలవరకు క్రమంగా హెచ్చుతో తగ్గుతో విలసిల్లితేనేగాని నవనాగరికతా యోగిపుంగవులకూ, విద్యాధికపితృదేవతలకూ, మా వూళ్ళో నాటకాల పిచ్చెయ్యకూ శాంతిలేక, తృణీకార దృష్టులతోనూ, పెదవి విరుపుళ్ళతోనూ నన్ను నీచస్తానానికి పడతోస్తారని నా భయం. తనకూ యితరులకూ అభిప్రాయభేదం కలిగినప్పుడు తన అభిప్రాయలకి కించిత్ లోపముగాని, యితరుల అభిప్రాయాలలో యీషన్మాత్రం ఆధిక్యంగాని వున్నదని వొప్పుకోని ప్రజాచక్రవర్తి మా తండ్రి. చిన్నప్పటినించికూడా ఆయన్ని చూడగానే విదుచ్ఛక్తి సంబంధమైన కొన్ని చలనాలు నా దేహంలో కలగడం నాకు మామూలు. ఒకసారి ఆయనకి జబ్బుచేసి నా దేహశుద్ధి తంతుకి సహితం లేచేశక్తిలేనప్పుడు 'నాయనా యింద' అని నన్ను దగ్గిరికి. పిలిచి చప్పున జుట్టుపట్టుకొని, మంచంకోడు కేసి నా తలబాదడం, నాకు రాత్రులు కలలుగా రావడం యీనాటికీ మానలేదు. ఆరు జెర్రుల్నీ, మూడుపాముల్నీ, రెండు బొమ్మజెముడు పొదల్నీ, నాలుగు పోట్లావుల్నీ, పదిమంది టీచర్లనీ భరించగలనుగాని, మాతండ్రి చూపు ఒక్క నిముషం నిదానంగా నా ముఖంమీద సహించలేను. ఆయన మొహం మహాత్యమో, నా బుద్ధి వక్రత్వమోగాని, ఆయన నావంక కన్నెత్తి రోకలి బండపురుగుని చూసినట్లు చూశాడా, యెనిమిదో హెన్రీ ఏడుగురు పెండ్లాల్ని చంపడమూ, అల్లావుద్దీన్ జాలలుద్దీన్ని చంపడమూ, పురుకుత్సుడో యెవడో చేసిన బ్రహ్మహత్యా, అన్నీ నేనే చేశాననుకొని భయపడి, కుక్కపిల్లమల్లే వీపుమీద పడుకొని, కాళ్లు పైకెత్తి నాలికజాచి నమస్కారం చేసి, డొక్కలో తన్నుకి సిద్ధపడతాను. అంత భయమే లేకపోతే, ఆయనమీద నాకున్న ద్వేషానికి, ఆయన్ని యెన్ని బాధలు పెట్టి, ఎన్ని మారణహోమాలుచేసి వుందునో! 'ముసలివాడైనాక తెలుస్తుంది!' అనుకుంటాగాని అప్పుడుమాత్రం లాభంలేదు. ఈ గుండెల గడబిడ ఆగితేకద! చస్తేమాత్రం-ఆయనే లేచి పలికి, 'నా పీనుగను కాలుస్తావా, నిన్ను....నిన్ను పాతెయ్యనా' అంటే నేను ఆయనకు నిప్పు అంటించగలననా! 'ఏమిట్రా ఆ పని!' అన్నాడంటే చావనూ!

ఒకటే ఆశ. బ్రహ్మసమాజం వాళ్ళతో కలిసి తద్దినాలు మానెయ్యాలని! అప్పటికీ భయమే. నాకు దెయ్యాల్లో నమ్మక ముంది. ఈ కాలయముడు దయ్యమైతే లోకాలు నిలుస్తాయా! నిద్రపోయ్యేప్పుడు గుండెల మీదెక్కి "యేమిట్రా, తద్దినం పెట్టవూ! నీ తద్దినం పెడతా, యీ రాత్రి," అని బొమికలు కటకటా చప్పుడు చేశాడంటే-

కాని యెంత పురుగునైనా, నన్ను అన్యాయంగా, కాలుకింద నలగ తొక్కుతోవుంటే, కొంచెం చోటుచేసుకొని తలెత్తి పాదం క్రింద నిలిచి నా అభిప్రాయం తెలియచేయకుండా వుండగలనా! ఆయన చండశాసనానుసారం శివుడు కంఠాన కాలకూటాన్ని భరించినట్టు నాలుగేళ్ళు నా ప్రబల విరోధిని నా తలమీద ప్రతిక్షణం ధరించి. దీనికి నూనెలురాసి, చిక్కుతీసి, పోషించాను. ఇంకెన్నాళ్ళు! స్కూలు ఫైనాలుతో మా హిష్టరీమాష్టరు, తప్పిన లక్ష్మీనారాయణ వెధవ, ఆ మిత్రభేదాల హెడ్మాష్టరు మీసాలు, అన్నీ వొదిలిపోయినాయి కాని, యీ జుట్టు భారాన్ని మాత్రం వెంటబెట్టుకుని బయటికిరానా? యింకా-

ఆవాళ తొమ్మిదిగంటలా పదినిమిషాలకి మా నాన్న దృష్టిని నా ముఖంతో వికసింపచేసి 'నాకో నాలుగణాలు కావా'లన్నాను.

'నాలుగణాలా! నాలుగు రూపాయి లేంకాదూ?' అని సంభాషణ ముగించి, కర్టన్ దింపాలని చూశాడు. ఒక్కసారి మేము స్కూలులో నాటకం వేశాం స్టేజీమీద. నాకూ ఒక కుర్రాడికీ సంభాషణ ఏర్పాటుచేశారు. అదంతా ఒకటిన్నర నిమిషం పడుతుంది. అంతే నా పార్టు. నా అంత తెలివిగలవాడికి అంత కొంచెం ప్రాముఖ్యత యిచ్చినందుకు చాలా అవమానపడి, వాడూ నేనూ కలిసి తమాషాచేశాం. మా ఒకటిన్నర నిమిషం సంభాషణ కాగానే, మేము గుడ్‌బై చెప్పుకోక, మా సరదా తీరేటట్టు, నోటి కొచ్చినట్టూ, తోచినట్టూ, కులాసగా, తీరుబడిగా సంభాషణ ప్రారంభించాం. లోపలనించి మమ్మల్ని రమ్మనే కేకలు మేము వినతలచుకోలేదు. చివరికి ఒక గంట అట్లా మాట్లాడి లోపలికి వెడితె తంతారు గనక, గుడ్‌బై చెప్పేసి, స్టేజిమీదనించి అమాంతంగా ముందున్న ప్రేక్షకులవేపు దూకి యింటికి కొచ్చెయ్యాలని మా యెత్తు.

"మన వూళ్లోకల్లా వెధవ యెవడ్రా బ్రదర్?" అన్నాడు వాడు, ఒక కాలు పైకెత్తి. నేను చెయ్యి ముందుకు జాచి, నాలిక బైటపెట్టి నవ్వి, 'మా నాన్న' అనపోతున్నాను. చప్పున కర్టను పడ్డది. చూశారా ఆ లేకితనం! మమ్మన్ని సీనైపోయిందో లేదో అడక్కుండా, గుడ్‌బై షోకుగా కాళ్ళసందునుంచి పెట్టకోనీకుండా, చప్పున కర్టన్ వెయ్యడం?

"నాకు నాలుగణాలు కావాలి" అని కడుపునొప్పిలాగు పట్టుకొన్నాను, నాన్నని. నామీద విసరివేయడానికి ఆయనకీ అందుబాటులో యేమీ లేని సంగతి చూశాను ముందే-రొంటిన డబ్బులూ, పొడుంకాయాతప్ప, డబ్బులన్నా వేసి నా మొహానికి దెబ్బతడిలిస్తాడు గాని, పొడుంకాయ వెయ్యడుకదా ?

"నాలుగణాలు, నాన్నా !"

"యెందుకురా?"

పదహారేళ్ళక్రితం తను ఒక పాడుపని చేశాననీ, దాని ఫలితమే నాలుగణాల కోసం అరుస్తోందనీ గుర్తించినట్టున్నాడు మా నాన్న.

"నేను స్కూలు ఫైనలు పాసయితే ఆంజనేయస్వామికి మొక్కు చెల్లిస్తా నన్నాను...." అది మరీ అంత పాడుపని కాదనీ, యీ శతాబ్దంలోకూడా స్వామికి మొక్కుకొనే కొడుకుని, పదేళ్ళ మాల చదువుకూడా పాడుచెయ్యలేని కొడుకుని కన్న తన ప్రసిద్ధికి గర్వం సూచించాయి, ఆయనకళ్ళు.

"కాని, ఆ మిగిలిన కొబ్బరిచిప్ప యింటికి పట్రా" అంటూ నాలుగణాలు నావేపు పారేశాడు. డబ్బులు ముందు గుప్పెళ్లో జాగ్రత్తచేసి-

"కొబ్బరికాయ కాదూ"

"కాదూ ? కోడిగుడ్లా ?"

"కాదు, నా జుట్టు"

"జుట్టా ?"

ఇటువంటి ఆపత్సమయాల్లోకూడా ధైరాన్ని విడవనటువంటి గుండె మా నాన్నది. కాని యిటువంటి దౌర్భాగ్యుణ్ణి కన్నందుకు మా అమ్మమీద, అంతమాత్రం కారణమూ లేకుండానే మా మామ మీదా మండిపడ్డాయి ఆయన కళ్లు. కాని ఏ ఆపత్తులోనూ, రైలుబండి చక్రాలక్రిందా, హెడ్మాష్టరువురుము చూపులకిందా కూడా జడుసుకోని వంశాబ్ధిసోముణ్ణి అయిన నేనుమాత్రం జంకుతానా ! అట్లాంటి సందిగ్ధాలలో, నాటకంలో వాళ్ళవలె, అన్నమాటే మళ్ళీ అంటే వుపకరిస్తుందని.

"అవును ! నాజుట్టు" అన్నాను.

"నీ మొహం," అని దిద్దాడు మానాన్న.

అప్రస్తుతంగా, యీ కుటుంబకలహాల్లోకి నా మొహాన్ని దించడం చాలా అన్యాయంగా తోచింది నాకు. కాని నా మొహం గౌరిగించవలసిన అవసరం మా నాన్నవలె నాకు పట్టలేదు యింకా. ఆ మాట అనడం గౌరవమైన కుటుంబంలో పుట్టి, సరియైన శిక్షణలో పెరిగి, స్కూలు ఫైనలు రిజిష్టరులో, 'కాన్డక్టు వెరీగుడ్' అని రాయించుకొన్నవాడి లక్షణం కాదని వూరుకొన్నాను.

'నా మొహంకాదు, జుట్టు' అని మా నాన్న వాక్యాన్ని నేను సవరణచేయడంతో వూరుకున్నాడు.

"నీ తలకాయి! అవతలికి నడు"

"అవును, అదే!"

"ఏమిట్రా? గొరిగిస్తావూ?" అని మండిపడ్డాడు. 'కత్తిరిస్తాను' అంటే కొంత జుట్టున్నా నిలుస్తుంది కదా అని కోపం సగం తగ్గిస్తాడనుకోవడం న్యాయమా, అన్యాయమా ! పోనీ 'మాథమిటిక్సు' ప్రకారం ఆలోచించండి. కాని మూడురెట్లు కళ్ళు మండిపడ్డాయి. మా నాన్నవి.

"తలంతానా?"

"జుట్టుమాత్రం"

"అదేనోయ్, మాలవెధవ్వవుతావన్నమాట"

ఆ లాజిక్ నాకు అర్థంకాలేదు.

"మామయ్యమల్లే" అన్నాను.

"మీ మామయ్య ఒక అప్రాచకవెధవ; మీ అమ్మ ఒక అంట్లముండ; వాళ్ళకు పుట్టినవాడివి నువ్వొ దరిద్రపుకుంకవి."

ఆ కోపంలో నే నెవరికి పుట్టానో నాన్న మరచిపోయినాడు. అక్కయ్య యెవరికి పుట్టిందంటారో విందామని ఆగాను కాని, లాభం లేకపోయింది.

"నువ్వుజుట్టు కత్తిరించు. చెపుతా, మొక్కుట. మొక్కు ! ఆంజనేయులుట, పీంజనేయులు !"

తన పేరిట్లా హటాత్తుగా మార్చాలంటే, అన్ని పేర్లుగల ఆంజనేయులైనా సంతోషించేవాడో లేదో కాని, మా ఆంజనేయులు మాష్టరుగారు మాత్రం, పీంజనేయులు మాష్టరని పిలిపించుకోవడాని కిష్టపడరని తెలుసు నాకు.

"వెధవ వేషాలు వెయ్యకు. పోయి కొత్తక్లాసు పాఠాలు చదవడం మొదలుపెట్టు" అని లేచి యింక నేను మాట్లాడ్డానికి వీలులేకుండా దొడ్లోకిపోయి కూచున్నాడు. నేనింకా యెన్నో చెపుదామనీ, నేను గొరిగించుకోకుండా యెందుకు కత్తిరించు కుంటున్నానో కారణం వివరిద్దామనీ అనుకున్నాను. పోనీ మీతో నన్నా వెళ్ళబుచ్చుకుంటా నా తెలివి, చూడండి. మీకు ఫ్రాక్షనులు వచ్చుకదా! అన్ని సబ్జక్టుల్లో వందమార్కులు వస్తే అంత జుట్టూ మొక్కాను కాని, ఇంగ్లీషులో నలభై, లెక్కలలో యెనభై, తెలుగులో నలభైయేడు వొచ్చాయి. అట్లానే ముందు జట్టు నూటికి నలభై పొట్టి, నూటికి యెనభై పొట్టి వెనక, పక్కలు తెలుగూ సయిన్సూ, ఏమాత్రం తెలివిగలవాడైనా యీ 'రీజనింగ్' వొప్పుకుంటాడా లేదా ఒక్క మానాన్న తప్ప !

కాలేజిలో యింటరు క్లాసులో కూర్చుంటే నా పెద్దజుట్టు ముడిని చూసి, నన్నూ నాముడినీ, కాలేజీ మ్యూజియంలో బిగిస్తారని మా నాన్నకు యెట్లా తెలియజేయడం !

వేదకాలంలో అందరికీ క్రాఫింగులేననీ, క్రాఫింగు పెట్టనివాడికి నూరు గోవుల జుల్మానా అని మనువు శృతుల్లో వ్రాశారనీ, క్రాఫింగులేని పుత్రుతెంతమంది ఉన్నా తండ్రికి పున్నామనరకం తప్పదనీ, క్రాఫింగు చేయించుకుంటాననే సదుద్దేశాన్ని వ్యక్తం చేసిన పుత్రుడి నిశ్చయానికి అడ్డంతగిలే తండ్రి అధోలోకానికి పోతాడనీ, శంకర, రామానుజ, మధ్వాచార్యులు వేదవ్యాసుణ్ణి అధ్యక్షుణ్ణిగా పెట్టుకుని శ్లోకాలు కోట్ చేసుకుంటూవచ్చి రూఢిచేసినా, తనమాట నిజమని వాదించే మ్లేచ్ఛప్రజాసంఘానికి నిత్యజీవనాధ్యక్షుడు మా నాన్న.

తలొంచుకుని సరాసరి సెలూన్‌కు వెళ్ళాను. కొట్టంలోవున్న దూడని చేరబొయ్యే ఆవులాగు. ఆ 'సెలూను' అధిష్టానమహాదైవం మంగలి మాధవుడు. తన పూర్వుల పద్ధతుల ననుసరించి, తన పంగనామాల వెడల్పు ఒక వాసి తగ్గించక యెంత బలీయమైన ప్రజాప్రాయాన్నీ ధిక్కరించినవాళ్ళలో ప్రథముడైన మాధవుడు యింటింట తిరిగి గొరిచే తన పెద్దలమార్గాన్ని విడిచి, అతను యిట్లా 'సెలూన్' తెరవడానికి కారణం లేకపోలేదు. యీ సెలూన్ తెరిచి, తన పితృదేవతల్ని ఒక్కసారిగా, రంభాశీతల బాహువులనుంచి, కావేడినూనెలోనికి జారేటట్టు చేసిన కారణానికి కొంత వరకు తండ్రి బాధ్యుడు అంటారు. మాధవుడు జన్మకుంటి.

మంగలైనాడు గాని మాధవుడి ముఖాన్న రాజఠీవివుంది. అతను ఆ దారిని యింటినించి వచ్చే సమయానికి తప్పకుండా గుమ్మాల్లో తత్సారంచేసే ముగ్గురు నిష్కలంక చరిత్రలను నే నెరుగుదును. జుట్టు ఇంగ్లీషు 'వి'('v') లాగు ముందు గొరిగి, నల్లగా తళ తళలాడే వుంగరాలను దువ్వి ముడివేసి కృష్ణదేవరాయల ముఖానికి అందం అధికం చేయగల నల్లన్ని పెద్దమీసాన్ని సద్ది తెల్లని మల్లుషర్టూ, వుప్పాడ కండువా ధరించి, నడుస్తో వుంటే అతని బిగించిన పెదమలూ, మధ్యచీలిన గడ్డమూ, విశాలమైన గంభీరమైన కళ్ళూ చూస్తే, అతని తల్లికి యే వెలమదొర యితన్ని కటాక్షించాడో అనిపిస్తుంది. మాధవుడు, మావూరు కోర్టు మునసబుకు క్షౌరం చేస్తూ వుంటే, అతని అంగవైకల్యము కనపబడకపోవడం చేత విగ్రహ గాంభీర్యం మతిక్రమించి, చూసేవాళ్ళకి కోర్టు మునసబే మాధవుడికి క్షౌరం చేస్తూన్నట్లు తోస్తుంది. అతని చంకలో సంచి కనపడ్డప్పుడుకూడా అదేదో ఫోల్డింగ్ కెమెరా (folding camera) లేక టైప్‌రైటరనుకుంటారు. అది మంగలిపొది అని తెలిసినా, అతను మంగలి అని తెలిసినా. క్షవరానికి పిలవడంమంటే యెంతవాడికీ జంకే. అతని సెలూన్‌లోకి వచ్చి చాలామంది మాధవుణ్ణి 'మంగలి యేడండీ ?' అంటారు.

మాధవుడు తన కిష్టమొచ్చినవాళ్ళకేగాని అందరికీ క్షవరం చెయ్యడు. ఎంత వుద్యోగస్తుడైనా సరే క్షవరం చెయ్యమని అడగగానే, మాధవుడు ముందు యెగాదిగా చూస్తాడు. దాంతోటే, అతనికి ఎట్లా కోపం తెప్పించామా అని చుట్టూ చూస్తాము. పికిలిగెడ్డం, మకిలిగెడ్డం, చచ్చుమీసాలు, కొరుకుడు మీసాలు వున్నాయా, మొహాన్ని వుమ్మేసినట్టు అసహ్యంగాచూసి, మాట్లాడకుండా వీపు తిప్పి వెళ్ళిపోతాడు, అనుమానస్పదంగా. మొహంమీద

ఒక కురుపు, ఒక మచ్చవుందా, డాక్టరు దగ్గరికి వెళ్ళమని చెయ్యివూపి, చూపులతో కాల్చివెడతాడు. ఒకసారి సత్యనారాయణని రోడ్డుమీద చూచి, నీకు గడ్డం చెయ్యాలని ఉన్నదని పట్టుకొన్నాడు మాధవుడు. నున్నని చెంపలూ, విశాలమైన గడ్డమూ చూశాడా, భూములూ, ఐశ్వర్యం దొరికినట్టు సంతోషిస్తాడు. ఒకసారి సంగమేశ్వరరావు భార్య చెంపలు గొరుగుతానని కూచున్నాడంటారు; ఎంతవరకు నిజమో ! హరిసింగు మనవూరు వొచ్చినప్పుడు, అతన్ని రోడ్డుమీద చూసి, అతని తలమీదనే దృష్టినిలిపి, కుంటివల్ల దూరమై, బండిచేసుకొని బంగాళాదాకా వెంటబడ్డాడు. అందరూ అతనితో మాట్లాడుతోవుంటే, మాధవుడు మాత్రం యిటూ, అటూ, చుట్టూ తిరుగుతో అతని క్రాఫ్ చూడడమూ, ఒంటికాలుతో గంతువేసి 'బలే, అచ్ఛా' అనడమూ, నాటకం చూస్తున్నట్టే చేశాడు. వితంతువులకు గొరగనని మాధవుడు నియమం పెట్టుకున్నాడు గాని, లేకపోతే, అతని ఠీవికీ, అందానికీ, కుంటికీ ఆవూరి చెరువుగట్టున బాలశవాల ప్రతిరూపాలు చాలా కనపడేవే.

ఇట్లాంటివాడికి రోజుకు నాలుగణాలు గిడతాయా ? ముందు కుంటి. ఎంత పెందలాడే బయలుదేరినా. కుంటుతూ క్షవరం చెయ్యవలసిన యిల్లు చేరేటప్పటికి వాళు క్షౌరమై స్నానంచేసి భోంచేస్తూ వుంటారు. పోనీ ఇతనికోసం కాచుకు కూచుంటే, యితని చెలచిత్త మొకటి వచ్చెను. మొదటిది అతను గొరుగుతూవుంటే మరిచిపోయి తలయెత్తి అతన్ని చూచి మరిచిపోయి ఎవరో పెద్దమనిషీ యెందుకో తమకోసం వచ్చారని తడబడే వాళ్ళు కొందరు ! ఇతను తీరావచ్చి, కొత్తవారి మొహం చూచి, నాలుగు రూపాయలిచ్చినా నీ గడ్డం తాకనని పోతే, చిక్కుపడే వాళ్లు కొందరు. పాతవాళ్ళయినా 'యీవాళ మొహం సరిగా కడుక్కోలేదు, క్షౌరం చేయడానికి వచ్చాగాని, పాకీపనికి రాలే'దని వెళ్ళిపోతే,యేడ్చే వాళ్లు కొందరు. క్రాపు చేస్తో చేస్తో పేను కనబడితే, 'ఛీ! యీతలను నేను తాక'నని వెనక కొంతా, ముందు కొంతా చేసి లేచిపోతే యేం కావాలి మనుష్యులపని !

కనక యింటింటికీ తిరగడం మాని, ముసలిపులివలె చెరువుప్రక్కన చెట్టుకింద చేరి, తృణకంకణంవలె కత్తిని తళతళ లాడిస్తో, చేతికి దొరికినవాళ్ళికి తగినశిక్ష చేసి పంపేవాడు కొన్నాళ్లు, కాని యితర మంగళ్లుచేసిన క్షౌరాల్ని వెక్కిరించడం వల్లా, తన క్షౌరానికి అమితంగా డబ్బు అడగడంవల్లా యితని వ్యాపారం పడిపోయింది. పెళ్ళాం నాను అమ్మి ఒక అతివాస్తవిక కవికి నాలుగు సార్లు వుచితంగా క్రాఫ్ చేసి 'అన్నిరకముల క్రాపులూ, గడ్డాలూ అతి నాజూకుగా, పరిశుభ్రముగా చేయబడు'నని గద్యపద్యం పాతకాయితంమీద వ్రాయించుకొని, అది బల్లమీద గీయించుకుని, దాన్ని వేళ్లాడకట్టాడు. మామూలుగా భారతి ముఖ చిత్రంవేసే చిత్రకారుడి మేనకోడలికి ఆరుసార్లు ముంగురులు కత్తిరించి క్రాఫుచిత్రం వేయించుకున్నాడు. ఆ బొమ్మ రెవికలేని ముసలి సరస్వతికి బాలకృష్ణుడు జుట్టు కత్తిరిస్తున్నట్టు కనపడేది అనేవాళ్లు. తెల్లవారకట్టనే లేచి, ముందు తన ముఖానికీ గిరజాలకీ

సేవచేసుకొని. పెద్ద మీసాల్ని దువ్వి, తన మందిరం గుమ్మంలో వచ్చేవారిని ఆహ్వానిస్తో, ఆనందమూ ఆదరణా వొలికే చూపు తయారుగా పెట్టుకొని నుంచుంటాడు. సారంగధర నాటకానికి ఆరుసార్లు వెళ్ళి చిత్రాంగి సారంగధరుణ్ణి ఆహ్వానించేప్పుడు నరసింహారావు పెట్టిన చూపు పట్టా ననుకొని, దానికి అనుకరణంగా యీ చూపుని సంపాయించాడు. కాని నరసింహారావు నటనాలోపమో, మాధవుడి అనుకరణలోపమో మొత్తానికి, ఆ ఆహ్వానపు చూపు మీదపడగానే, ఆలోపలికి వొస్తున్న మనిషి సరాసరి గొంతుకలో కత్తిగుచ్చిన కోడివలె గిజగిజలాడి వెనక్కి రెండడుగులువేసి 'కాఫీహొటలు అనుకొన్నా'నని గొణిగి, తిరిగి చూడకుండా పలాయనమౌతాడు. ఇట్లా పరిగెత్తినవాళ్ళలో ముఖ్యుడైన నారాయణ 'యేమిత్రా ఆ మాధవుడు అట్లా చూస్తాడు! తన గూడులోకి వచ్చే యీగని సాలీడు చూసినట్లు !' అన్నాడు. మనుష్యు లందరూ పారిపోవడం చూసి మాధవుడు ఇంకో ఉపాయం కనిపెట్టాడు. ఒంటికాలిమీద గంభీరంగా నుంచుని వున్నవాడల్లా, కొత్తవాడు రాగానే, ఆ మనిషి గాలి తగలగానే, బాలెన్సు తప్పి వెనక్కి పడేట్టు వూగుతాడు. భయపడి ఆ మాధవుణ్ణి పట్టుకోపోగానే, ఆ మాధవుడే వూతానికన్నట్టు వాళ్లని పట్టుకుని లోపలికి లాక్కెళ్ళి క్షౌరం చేస్తాడు.

ఇంతా యింటివద్దనించి ప్రహ్లాదుడివలె పోట్లాడిపరుగెత్తుకుని మాధవావతారం కోసం బయలుదేరిన నాకు ఒక మంగలీ కనబడలేదు. నా గాబరాలో ఒళ్లు తెలీక, బోర్డుచూచి మాధవుడి గృహంలో ప్రవేశించాను. లోపల తల పెట్టడంతోనే, మొహంమీద చెంబెడు చన్నీళ్లు కొట్టినట్టు మాధవుడి చూపు తగిలి 'ఇక్కడ మామయ్యలేడే?' అని వెనక్కి వెళ్లిపోతుండగా మాధవుడు 'దయచెయ్యడండి' అంటో ముందుకు నామీద వాలి, ఒకచేత్తో జుట్టూ, రెండోచేత్తో మెడా పట్టుకొని ఏమీ కనపడకుండా నామీద ఆనుకుని, కుంటుకుంటో తీసుకుపోయి, కుంటి కుర్చీలో తోశాడు. నాజుట్టుని వదలక, పట్టుకునే దూరంగావున్న కత్తెర నందుకుని 'యెట్లా?' అన్నాడు. ఆ నిమిషాన మా యిద్దర్నీ యెవరైనా చూస్తే అశ్వద్ధామ దుష్టధ్యుమ్నుణ్ణివలె నన్నా నరాంతకుడు 'నిన్నెట్లా చంపమన్నావు ? జబ్బ పట్టుకుని వెనక్కి వొంచి కంఠంలో పొడవనా, కిందికి లాగి గుండెలమీద కాలేసి మెల్లిగా వెనకనించి కోడిని కోసినట్టు కొయ్యనా, తలమీదనించి కొబ్బరి బొండంమల్లే చిల్లిచేసి రక్తం పీల్చనా, నా చాకచక్యం తెలిసేట్టు అక్కడక్కడ చదరంగా గాట్లు చేసి, చెట్టులో రాని పాలమల్లే రక్తం స్రవింపచెయ్యనా ?' అని అతి వాత్సల్యంతో ప్రశ్నిస్తున్నట్టు కనపబడివుండేది. అవన్నీ తెలీక నేను 'క్రాప్' అన్నాను.

"ఏం క్రాపు? బెంగాలీ, ఆస్ట్రోజపానీసు, కాకేషియన్, పెరూయిష్, జర్మన్ సిల్వరీ, ఆయితానగరం, హావేలియన్, ఆత్మగౌరవం, గాంధి ఇర్వియన్, న్యూథియేటర్సు - ఏది"? అన్నాడు.

"హిమాలయన్ క్రాఫ్' అన్నాను.

'హిమాలయన్' అన్నాడు అతను తనుకూడా. ఒక్కనిమిషం ఇటూ అటూ ఎవరూ లేకుండా చూసి ఒక్క దెబ్బన నాజుట్టు ముడి కంఠం నరికి, వైద్యుడు దంతం పెరికి కళ్ళముందు పెట్టినట్టు నా జుట్టుముడిని నా ముందు ప్రదర్శించి, తన ప్రజ్ఞను మెచ్చుకోమన్నట్లు గర్వంగా నావంక పెళ్లికూతురువంక పెళ్లికొడుకు చూసినట్టు చూశాడు. 'ఇంకా ఈ తమాషా కూడా చూడు. నే నెంతటివాణ్ణో నీకే తెలుస్తుంది.' అన్నట్టు నా భుజంమీద చెయ్యేసి, నా చుట్టూ కుంటుకుంటో ప్రదక్షిణంచేసి తలకాయ పట్టుకుని వీపుమీద గుద్దపోయేవాడిలాగు కుర్చీకిందికి నన్ను వొంచాడు. ఎప్పుడైనా నీ తొడలమధ్యనించి, కుర్చీకాళ్లలోంచి ప్రపంచాన్ని చూశావా ? ఈసారి ప్రయత్నించు, పోనీ, ప్రపంచాన్నంతా చూడనక్కర్లేదు. శ్రీరామ పట్టాభిషేకపటం చూడు, ఆంజనేయులకాళ్ల కిందనించి.

నా కళ్ళముందే నల్లులు నా తొడల్ని శేషాద్రి వేడియిడ్లెన్లలాగు పీక్కుతింటున్నాయి. రోగిపక్కనున్న పాలు తాగే పిల్లికి అతని అసహాయస్థితిని గురించి ఎంతధైర్యమో, కట్టేసిన కుక్కని చూస్తే కాకికి ఎంత సాహసమో మాధవుడి చేతిలోని క్షౌరాతురుణ్ణిచూస్తే నల్లుల కంత ధైర్యం. కుర్చీచిల్లులు లెఖ్ఖపెట్టాను. కింద న్యూసుపేపరుముక్క పడివుంటే, దాంటో మకిలికప్పని అమృతాంజనం సుగుణపుమాటలన్నీ భద్రంగా వొప్పగించగలిగేట్టు బట్టీ పెట్టాను. పక్కని తిరపతిక్షేత్రంమీద అమాంతంగా యం.యస్.యం. రైల్వేవాళ్ళకి కలిగిన మహత్తరభక్తి విశేషాల్ని గ్రహించాను. నా మెదడు తలకిందులు కావడం చాతనోఏమో, ఆ నిమిషాన టీచర్లకీ విద్యార్థులకీ చాలా సహాయభూతమైన విషయం నా కొకటి తోచింది. ఈ విషయాన్ని కాపీరైటు చేయించి అధికధరకు అమ్మదామనుకున్నాను గాని, ఈ టీచర్ల గర్భదారిద్ర్యాన్ని, స్వల్పవేతనాల్ని, రూపాయికి అణాకట్లనీ గమనించి, ఉచితంగా ప్రకటిస్తున్నాను. పిల్లలకి పద్యాలన్నా, ఎక్కాలన్నా, స్పెల్లింగులన్నా తప్పులేకుండా రావాలంటే, వాటిని పకోడీలూ, ఉప్మా పొట్లంకట్టని మంచి మకిలికాయితంమీద వ్రాసి నేలమీదపెట్టి, బల్లమీద కూచున్న కుర్రదాని తలని వొంచి కాళ్ళమధ్యనించి కాయితం కనబరుస్తో, టీచరు ఒంటికాలి మీదకుంటుతో, ఆ పిల్ల తలెత్తకండా కత్తితో జడిపిస్తో చుట్టూ తిరుగుతోవుంటే, అప్పుడు నేర్చుకున్న విద్య కుర్రది ఆరుకాన్పులైనా మరిచిపోదు.

మాధవుడి కత్తెరకి వుత్తమమైన అలవాటు ఒకటి వుంది. దాన్ని నాగపూరులో సంపాయించిందంటాడు. ఆ కత్తెరని మాధవుడు జాలరుపేటలో కొన్నాట్ట. మాధవుడు వెంట్రుకని కత్తిరించపోయినప్పుడు ఆ కత్తెర వెంట్రుకని మలేరియామల్లే, మళ్ళీ పెళ్ళిలో హీరోయిన్నుని హీరోమల్లే పట్టుకుని మళ్ళీ వొదలదు; తనతో లేచిరమ్మంటుంది. కత్తెర రమ్మనడం, వెంట్రుక రాననడం ఫిల్ములో చూడడం బాగానే వుంటుంది కాని వెంట్రుక సొంతదారుడికి ఆ ప్రణయకలహం ప్రాణాంతకరంగా తోస్తుంది. ఇదే ఎంకిపాటలద్వారా, ఆధ్యాత్మికంగా కొందరు పరలోక వాసప్రయాణీకులు అర్థం తీశారు.

ఎంకి మూఢాత్మా, నాయుడు పరమాత్మాకాగా లేనిది, కత్తెర బావా, వెంట్రుక వెంకీ కాకూడదూ? కావచ్చు. కాని ఆ ఆత్మల ఆరాటం నీ తల మీద జరిగితే మాత్రం, అందులో వారసగా వేలకొలది యెంకుల్ని ఒకేనాయుడుబావ, శ్రీకృష్ణుడుమల్లే బలవంతంగా పైకి లేవతీసుకు పోతో వుంటే మాత్రం, ఆ ఎంకుల ఏడుపు భరించడం కష్టం.

నాయుడు ఉంటే, 'నా సొగసు నన్నైన సూసుకోనీడమ్మ' అంటుంది. వెడితే 'నన్నిడిసి పెట్టెళ్ళినాడే' అని యేడుస్తుంది ఎంకి.

ఏమైతేనేం?

"నీతోటి నే రాను కత్తెరబావా,<br>
నీమాట నే యిన్ను కత్తెరబావా,<br>
సరుకులన్ని యిస్తాను, ఎంట్రికపిల్లా,<br>
సల్లగుండు పద్దాక, కత్తెరబావా,<br>
ఏడనే నీ కాపురమో ఎంట్రికపిల్లా,<br>
ఈడి తలమీదె కాపురమో కత్తెరబావా."

◆ ◆ ◆

*ప్రచురణ : (విచిత్రనళీయం కథలు), ఎమెస్కో ప్రచురణ, 1967*